ఓటరు నమోదును పకడ్బందీగా నిర్వహించాలి

ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి, సెప్టెంబర్ 24 : ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో స్పెషల్ సమ్మరీ రివిజన్, ఈఆర్‌వో 2.0పై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజులుగా నూతన ఓటర్ నమోదుపై చేపట్టిన ఇంటింటి సర్వే పని తీరు చాలా మెరుగుపడిందన్నారు. ఇప్పటి వరకు 90 శాతం పైగా ఇంటింటి సర్వే పూర్తయిందని తెలిపారు. సెప్టెంబర్ 28 నాటికి 100 శాతం ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ స్థాయి అధికారుల ద్వారా ఇంటింటి సర్వే పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఓటర్ నమోదుకు సంబంధించి ఫారం-6, 7, 8 దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని సీఈవో ఆదేశించారు. సెప్టెంబర్ నెలాఖరు వరకు పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలని అన్నారు. ఇంటింటి సర్వేలో ఆధార్ నంబర్ సేకరణ తప్పనిసరి కాదన్నారు. ఓటర్లు ఇష్టం ఉంటే ఇవ్వొచ్చని, బలవంతం చేయరాదని చెప్పారు. నూతన ఓటరు కార్డుల ముద్రణకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.

పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సమర్పించాలన్నారు. పోలింగ్ కేంద్రం లొకేషన్, ఫొటోలను బీఎల్‌వో అప్‌లోడ్ చేయాలని అన్నారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల గ్రాడ్యుయేట్స్ టీచర్లు, ఖమ్మం, నల్గొండ జిల్లాల టీచర్ల శాసనమండలి సభ్యుల నియోజకవర్గ స్థానాలకు ఎన్నిక కోసం సెప్టెంబర్ 30న పబ్లిక్ నోటీసు జారీ చేసి ఓటర్ నమోదు చేస్తారన్నారు. సమావేశం అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో లేవనెత్తిన రేషనలైజేషన్ పరిశీలించాలని, వారి అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పోచారాన్ని కలిసిన ఏఎంసీ పాలకవర్గ సభ్యులు

పోచారాన్ని శాలువాతో సన్మానిస్తున్న వర్ని మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, ఆయా మండలాల నాయకులు

బాన్సువాడ, సెప్టెంబర్ 24 : బాన్సువాడలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డిని వర్ని మండల మార్కెట్ కమిటీ నూతన ఏఎంసీ చైర్మన్‌గా సురేశ్ బాబా, చందూర్ మండలానికి చెందిన వేములపల్లి సుధాకర్‌రావు, ఎస్‌కే హైమద్‌ను డైరెక్టర్లుగా నియమించినందున నాయకులు మంగళవారం కలిశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ కవిత అంబర్‌సింగ్, ప్యారం అశోక్, రుక్మిణి రాంరెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్ రావు, నర్సాగౌడ్, సత్యనారాయణ, రవి, గంగారాం తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడలో కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి రామాచారి గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి మంగళవారం పరామర్శించారు.

శుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలి

బాన్సువాడ, సెప్టెంబర్ 24 : డివిజన్‌లోని అన్ని గ్రామాల ప్రజలకు శుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని, మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలు ఉంటే వెంటనే భగీరథ అధికారులకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలియజేయాలని మిషన్ భగీరథ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్‌గౌడ్ సూచించారు. నల్ జల్ మిత్ర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెండో రోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ గ్రామసహాయకులకు ప్లంబింగ్, సింగల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటర్ల ప్యానల్ బాక్స్‌లు, చేతిపంపుల మరమ్మతులు చేపట్టే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇంట్రా ఏఈ శ్రీకాంత్, కార్యాలయ సిబ్బంది సక్రునాయక్, రమేశ్, గ్రామ స్థాయి సహాయకులు పాల్గొన్నారు.

మహార్యాలీని విజయవంతం చేయండి

బాన్సువాడ, సెప్టెంబర్ 24 : రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దగ్గరికి వస్తున్నప్పటికీ బీసీల సమస్యలు పరిష్కరించడం లేదని, బీసీల డిమాండ్లే లక్ష్యంగా హైదరాబాద్‌లో బుధవారం(నేడు)నిర్వహించే బీసీల మహార్యాలీని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం డివిజన్ అధ్యక్షుడు విజయ్ కోరారు. ఈ సందర్భంగా బాన్సువాడలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీసీలు ఐక్యంగా ముందుకు సాగి, హక్కుల సాధనకు పోరాడే సమయం అసన్నమైందని అన్నారు. సుందరయ్య పార్కు నుంచి ఇందిర పార్కువరకు నిర్వహించే బీసీ మహార్యాలీలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దత్తు, జిల్లా నాయకుడు నిఖిల్‌గౌడ్, మండల అధ్యక్షుడు రాఘవ, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

శనగ విత్తనాల పంపిణీ

రాజంపేట్, సెప్టెంబర్ 24 : మండలంలోని ఆర్గొండలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని సొసైటీ చైర్మన్ శివరాములు మంగళవారం ప్రారంభించారు. 25 కిలోల బస్తా రూ.2,250 ఉందని, కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రాజు, మల్లారెడ్డి, రాజిరెడ్డి, చిన్న సాయిలు, సీఈవో సాయిలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

బోర్లంలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

బీబీపేట్/బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 24 : పరిసరాలను శుభ్రంగా ఉంచాలని మండల ప్రత్యేకాధికారి సతీశ్ యాదవ్ అన్నారు. మండలంలోని మాందాపూర్ గ్రామాన్ని మంగళవారం సందర్శించి గ్రామంలో చేపట్టిన పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. గ్రామంలో పంచాయతీ కార్మికులు, ఆశ వర్కర్లు, గ్రామస్తులతో కలిసి స్వచ్ఛతా హీ సేవ ప్రోగ్రాం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి గంగుబాయికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశవర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఎంపీడీవో బషీరుద్దీన్ పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో సత్యనారాయణరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయి కుమార్, అంగన్‌వాడీ టీచర్లు విజయ, పద్మ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి, సెప్టెంబర్ 24 : కామారెడ్డిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నిజాం, ఉపాధ్యక్షుడిగా సంతోష్ రెడ్డి, కార్యదర్శిగా శివకుమార్, సహ కార్యదర్శిగా సతీశ్‌కుమార్, మహిళా కార్యదర్శిగా లత, కోశాధికారిగా సుజాత, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా వేణును ఎన్నుకున్నారు. ఎలక్షన్ ఆఫీసర్‌గా అజ్మల్ ఖాన్ వ్యవహరించారు.

బాన్సువాడలో ఫుడ్ ఫెస్టివల్

స్టాళ్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

బాన్సువాడ, సెప్టెంబర్ 24 : పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, మున్సిపల్ చైర్మన్ గంగాధర్ హాజరై ప్రారంభించారు. విద్యార్థులు తీసుకువచ్చిన వివిధ రకాల వంటకాలను సబ్ కలెక్టర్ రుచి చూశారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్నారులు, తల్లిదండ్రులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయని అన్నారు. అనంతరం స్టాళ్లను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు డాక్టర్ అంజిరెడ్డి, ఉదయ్ గుప్తా, ఎజాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, ఉపాధ్యాయులు పద్మ, రేఖ, వీణ, సునీత, లలిత, సుష్మ, నరేశ్ పాల్గొన్నారు.

ఆరోపణలు అర్థరహితం

మాట్లాడుతున్న ఐఎంఏ సభ్యులు

కామారెడ్డి, సెప్టెంబర్ 24 : ఇటీవల అపెక్స్ దవాఖానపై వచ్చిన ఆరోపణలు అర్థరహితమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమణ అన్నారు. పట్టణంలోని ఐఎంఏ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 22వ తేదీన సాయంత్రం 6 గంటల సమయంలో శ్రీనివాస్ అతని మిత్రులు ఎక్కువ మోతాదులో మద్యం తాగి ద్విచక్ర వాహనం పైనుంచి పడి చికిత్స కోసం అపెక్స్ దవాఖానకు వచ్చారని తెలిపారు. డ్యూటీలో ఉన్న డాక్టర్ ప్రథమ చికిత్స అందించి తలకు కుట్లు వేసుకోవాలని చెప్పడంతో అతను నిరాకరించాడని, డాక్టర్లను, నర్సింగ్ స్టాఫ్‌ను అసభ్య పదజాలంతో తిడుతూ బయటికి వెళ్లి వేరే దవాఖానకు వెళ్లాడని తెలిపారు. అక్కడ కూడా అసభ్యకంగా ప్రవర్తించడంతో దవాఖాన సిబ్బంది బయటికి పంపించారన్నారు. తిరిగి తన స్నేహితులతో అపెక్స్ దవాఖానకు వచ్చి తలుపులు వేసి, కుర్చీలను పడేసి సిబ్బందిపై అసభ్యకరంగా తిట్టాడని అన్నారు. అతనికి ఎలాంటి కుట్లూ వేయలేదని అన్నారు. కుట్లు వేసి డబ్బులు ఇవ్వకపోతే కుట్లు తీశారని కొన్ని పత్రికల్లో ఆరోపించారని అన్నారు. ఆ వ్యక్తి ఎలాంటి కుట్లూ వేయలేదని అన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై, శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని కామారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ అరవింద్‌గౌడ్, వైద్యులు వెంకటేశ్వర్‌గౌడ్, డాక్టర్ రమేశ్, అపెక్స్ దవాఖాన వైద్యుడు డాక్టర్ నవీన్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో డెయిరీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

కామారెడ్డి/బాన్సువాడ రూరల్/మాచారెడ్డి, సెప్టెంబర్ 24 : జిల్లా కేంద్రంలోని డెయిరీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా గ్రామాల్లో నిర్వహించే సమాజ సేవ, పరిశుభ్రత, ఆరోగ్య సేవ, పచ్చదనం, విద్యా, వైద్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శరత్‌చంద్ర, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఉమాపతి, స్వర్ణ లత, రవీందర్ రెడ్డి, మాధవి, సురేందర్, శ్రీనివాస్, శరత్, శైలజ, స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు. బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డేను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాలస్వామి, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు శ్రీనివాస్, రాజేశ్, వినయ్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. మాచారెడ్డిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. మోటివేషనల్ స్పీకర్ రమేశ్ చైతన్య, ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 యూనిట్ అధికారులు తిరపతిగౌడ్, రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాల్వంచలో గుడిసె దగ్ధం

మాచారెడ్డి, సెప్టెంబర్ 24 : పాల్వంచ మండలంలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో నివాసపు గుడిసె దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాందెడి రమేశ్ నివాసపు గుడిసె మంగళవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బట్టలు, నిత్యావసర వస్తువులు, సామగ్రి కాలిపోయాయి. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు కోరారు.

బాన్సువాడ ఎస్‌హెచ్‌వోగా అశోక్

బాన్సువాడ, సెప్టెంబర్ 24 : బాన్సువాడ ఎస్‌హెచ్‌వోగా అశోక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా బాన్సువాడకు ఎస్‌హెచ్‌వోగా అశోక్ బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించిన కృష్ణను మల్టీ జోన్-1 ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన కృష్ణకు శాలువాతో సత్కరించారు. బదిలీపై బాన్సువాడకు వచ్చిన అశోక్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు భిక్కనూరుకు ఎమ్మెల్యే రాక

భిక్కనూరు, సెప్టెంబర్ 24 : మండల కేంద్రానికి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి బుధవారం రానున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్ మంగళవారం తెలిపారు. తహసీల్ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

అడవి పంది మాంసం తిన్న వారిపై కేసు

రామారెడ్డి, సెప్టెంబర్ 24: మండలంలోని పోసానిపేట గ్రామానికి చెందిన బండారి తిమ్మయ్య పొలం వద్ద అడవి పందిని కుక్కలు వేటాడి చంపేశాయి. దీంతో అడవి పంది మాంసాన్ని పలువురు వండుకొని తిన్నారని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జయశ్రీ తెలిపారు. అడవిపంది తలభాగాన్ని స్వాధీనం చేసుకొని, నిందితులపై మంగళవారం కేసు నమోదు చేశామని అన్నారు.

ధర్మారెడ్డిలో స్వచ్ఛతా హీ సేవా

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 24: మండలంలోని ధర్మారెడ్డి గ్రామంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రమేశ్ గ్రామంలోని ప్రధాన వీధుల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు, డ్రైనేజీలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఎఫ్ఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

గాంధారి, సెప్టెంబర్ 24: మండలంలోని గౌరారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్య సహాయ అధికారి హరికృష్ణ 158మంది విద్యార్థులను పరీక్షించారు. ముగ్గురికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. పలువురికి కండ్ల అద్దాలను రెఫర్ చేశారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంటల నమోదు పరిశీలన

మోడేగామ్‌లో పంటలను క్షేత్రసాయిలో పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

రామారెడ్డి, సెప్టెంబర్ 24: సదాశివనగర్ మండలంలోని మోడేగామ్‌లో రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలను ఇటీవల ఏఈవోలు నమోదు చేసుకున్నారు. జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి నమోదు ప్రక్రియను పరిశీలించారు. వరికి సుడిదోమ, మెడవిరుపు, కాండం కుళ్లు, కాటుట తెగుళ్లు సోకినట్లు గుర్తించారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి ప్రజాపతి, పలువురు రైతులు ఉన్నారు.

పోషకాహారంతో తల్లీబిడ్డలు క్షేమం

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతా రావు

మహ్మద్‌నగర్‌లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్/ బిచ్కుంద, సెప్టెంబర్ 24: గర్భిణులు పోషకాహారం తీసుకుంటే తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటారని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మహ్మద్‌నగర్ మండల కేంద్రం, బిచ్కుందలో మంగళవారం నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అప్పుడే పుట్టిన శిశువుకు ముర్రు పాలు తాగించాలని, దీంతో వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహారాన్ని అంగన్‌వాడీల ద్వారా అందజేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జయప్రదీప్, కాంగ్రెస్ నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల అధ్యక్షులు ఏలె మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, రెవెన్యూ, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు. బిచ్కుందలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీవో కళావతి, సూపర్‌వైజర్ వినోద, ఆయా గ్రామాల అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

గాంధారి, సెప్టెంబర్ 24: మండల కేంద్రంలోని దుర్గానగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతలపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినప్పుడు మంటలు ఆర్పడానికి వినియోగించే వస్తువులతోపాటు మంటలు ఆర్పే విధానం, ప్రమాదంలో ఉన్న వారిని రక్షించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తూర్పు వెంకట్‌రాజ్, ఎం.నవీన్, నరేందర్, శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతుల వివరాల నమోదు

వివరాలు నమోదు చేసుకుంటున్న వ్యవసాయాధికారులు

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 24: మండలంలో రుణమాఫీ వర్తించని రైతుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి హరి వెంకటప్రసాద్ మంగళవారం తెలిపారు. మండలంలో రుణమాఫీ వర్తించని రైతులు 942మంది ఉండగా.. ఇప్పటివరకు 670మంది వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనతోపాటు ఏఈవో దివ్య ఉన్నారు.

బస్టాండ్ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

ఆర్డీవోకు వినతి పత్రాన్ని ఇస్తున్న నేతలు

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 24: ఎల్లారెడ్డిలో కొత్తగా నిర్మిస్తున్న బస్టాండ్ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని బీఎస్పీ ఎల్లారెడ్డి నాయకులు ఆర్డీవో మన్నె ప్రభాకర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పనులు ఎక్కడి కక్కడే ఆగిపోయాయని, సరైన సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు రోడ్లపై నిలబడాల్సి వస్తున్నదని అన్నారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి బస్టాండ్‌ను ప్రారంభించాలని వారు ఆర్డీవోకు సమర్పించిన వినతిపత్రంలో కోరారు.

మండల స్థాయి ఖోఖో జట్లు ఎంపిక

లింగంపేట, సెప్టెంబర్ 24: డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొనే అండర్-14, అండర్ -17 విభాగాల ఖోఖో జట్లను ఎంపిక చేసినట్లు క్రీడల మండల కన్వీనర్ రాజాగౌడ్ తెలిపారు. లింగంపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో క్రీడాకారుల ఎంపిక నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులు డివిజన్ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు.

గ్రామాల్లో సమావేశాలు

లింగంపేట, సెప్టెంబర్24: మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు మంగళవారం సమావేశాలు నిర్వహించారు. ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు సూచించారు. మండలంలోని పోల్కంపేట, కన్నాపూర్, రాంపల్లి, రాంపల్లి స్కూల్ తండా, కోమట్‌పల్లి తదితర గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు నియామక పత్రాల అందజేత

నిజాంసాగర్, సెప్టెంబర్ 24: మండలంలో కొత్తగా ఎంపికైన రేషన్ డీలర్లకు తహసీల్దార్ భిక్షపతి మంగళవారం నియామకపత్రాలను అందజేశారు. బంజపల్లి డీలర్‌గా సయ్యద్ ఖాజా మొయినుద్దీన్, వెల్లనూర్ రేషన్ డీలర్‌గా నాటకారి మానస ఎంపిక కాగా.. వారికి నియామక పత్రాలను అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఒకటిన చేపల పెంపకంపై శిక్షణ

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 24: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో అక్టోబర్ ఒకటో తేదీన చేపల పెంపకంపై శిక్షణ నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం జగదీశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఆసక్తి ఉన్న రైతులు శిక్షణకు హాజరు కావాలని సూచించారు. 20 గుంటల సొంత భూమి ఉన్న రైతులు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలిపారు. ఒక యూనిట్ విలువ రూ.3లక్షల28వేలు కాగా ప్రభుత్వం 35 శాతం రాయితీ ఇస్తుందని పేర్కొన్నారు.

మధుసూధనాచారిని కలిసిన నాయకులు

మధుసూధనాచారితో బీఆర్ఎస్ నాయకులు

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 24: శాసన మండలి ప్రతిపక్ష నేతగా ఎన్నికైన మధుసూదనాచారిని తెలంగాణ భవన్‌లో మండల బీఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ సత్యంరావు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి సత్కరించి స్వీట్ తినిపించారు. పార్టీకి సంబంధించిన పలు విషయాలను చర్చించారు.

రేపటి నుంచి మండల స్థాయి క్రీడలు

గాంధారి, సెప్టెంబర్ 24: మండలస్థాయి క్రీడలను 26వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పీఈటీ లక్ష్మణ్‌రాథోడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేట్‌సంగెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడలు ఉంటాయని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★అనఘా షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు సూపర్‌వైజర్ (M/F) Sal:15000/- అనుభవం గల ఎల్క్ట్రిషియన్ (డిప్లామ ఎల్క్ట్రిషియన్) Sal:15000/- month మరియు సెక్యూరిటీ గార్డ్స్ (M/F) Sal:12000/- month కావలెను. ఆసక్తి గలవారు వెంటనే I.D. ప్రూఫ్, ఫోటోతో సంప్రదించండి. అనఘా షాపింగ్ మాల్, R.P రోడ్, నిజామాబాద్
NTZ-334461

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331774

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వార